

# కదలిక

లక్ష జనాభా వున్న ఆ వూరికి అలంకారంగా ఓ జూట్ మిల్లు ఉంది. మరో వారంలో పన్నెండేళ్ళొస్తాయి దానికి.

* * *

ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర కొచ్చారు గోపాలరావు, నారయ్య. ఎలక్ట్రిక్ పోల్ మాత్రం వుంది. బల్బు లేదు. వెన్నెల తెల్లగా మనుషుల్ని గుర్తు పట్టటానికి వీలుగా వుంది.

"మీరిక్కడ వుండండి....మా ఆవాళ్ళని సినిమాకి పంపేసి వస్తా...." అన్నాడు నారయ్య.

"ఇక్కడా...." అన్నాడు గోపాలరావు చుట్టూ చూస్తూ.

స్తంభం పక్కగా ఓ పాకుంది. ఆ చుటుపక్కల వాళ్ళకి అదే టీ కొట్టులా వుంది. గుడ్డిలైటు కూడా లేదు....వేసేసిన తలుపులు. ఓ చెక్క బెంచీ తప్ప.

"ఎంతి సేపయ్యగారూ....ఓ క్షణంలో వచ్చేయ్యను! ఆ బెంచీ మీద కూచోండి. అదిగో ఆ కనపడేదే మా పాక—" అని వేలుతో ముందుకి చూపించాడు నారయ్య.

వెన్నెల్లో ఆ పాకలు—గోడవుసులో గుట్టలుగా పరిచిన జూట్ బేల్సులా కనపడ్డాయి గోపాలరావుకి.

"సరే...." అన్నట్టు తలూపాడు.

తలూపుతూనే నారయ్య నసుగుడు చూశాడు.... చూసి ఓ రెండు రూపాయలు తీసిచ్చాడు గోపాలరావు.

అవి అందుకుని "ఇప్పుడే వచ్చేస్తా బాబుగారూ!" అని మరోసారి భరోసా చెప్పి ముందుకి నడిచాడు నారయ్య.

నారయ్య మురిక్కాలువ తూము దాటి, తొందరగా పాక్కుంటూ పోయే జీవిలాగ ఆ పాకల్లో కలిసి పోయేవరకు అటు వేపు చూశాడు గోపాలరావు. తర్వాత చెక్కబెంచీ మీద కూచుందా మనుకొని తెల్ల పాంటు గుర్తొచ్చి ఆగిపోయాడు.

సహజంగా అన్నిటికీ తేలిగ్గా చిరాకుపడే గోపాలరావుకి అలా నిలబడటం చిరాకనిపించలేదు.

పది దాటకుండానే మనుషుల సందడి చాలావరకు తగ్గిపోయిం దక్కడ.... రెండు-మూడు గాడిదలు నెమ్మదిగా వెన్నెలని పరికిస్తు న్నట్టు తూము దాటుతున్నాయి. నారయ్య తిరిగి రావటానికి కనీసం పది నిముషాలేనా పడుతుందని తెలిసినా ఏం చెయ్యటానికి తోచక అసహనించే ఎదురు చూడటం మొదలెట్టాడు గోపాలరావు.

అయిదు నిమిషాలు గడిచేటప్పటికి కొంచెం యిబ్బందిగా అని పించి సిగరెట్టు వెలిగించాడు. జరగబోయే తంతుని తలచుకుంటూ సిగరెట్ పొగని గట్టిగా పీల్చాడు. సిగరెట్టు పొగలోంచి ఆలోచన లోంచి వేడి వొళ్ళంతా పాకింది.

"ఎంతయినా మగాడిచాటు ఆడదంటే ఆ హుషారు వేరు." అనుకున్నాడు ముసిముసిగా నవ్వుకుంటూ.

వెంకడి పెళ్ళామనో, రంగడి పెళ్ళామనో నారయ్య అనటం గుర్తొచ్చింది గోపాలరావుకి. వాడు తన మిల్లులోనే పని చేస్తాడని కూడా చెప్పాడు నారయ్య. అయినా వాడెవడో గుర్తు తెచ్చుకోవాలని ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు.

అయిపోయిన సిగరెట్టు పారేస్తుంటే - వెన్నెల రొదలా దూరం నుంచి మోసుకొచ్చిన మాటలు వినపడ్డాయి గోపాలరావుకి.

తూము దాటుతూ ఎవరో యిద్దరాడాళ్ళు రావటం కనిపించింది. వాళ్ళకి పది గజాల దూరంలో నారయ్య కూడా కనిపించాడు. తూము

దాటాక వాళ్ళని సాగనంపి నెమ్మదిగా వచ్చాడు గోపాలరావు దగ్గరికి నారయ్య.

"రండి బాబుగారూ! కొంచెం ఆలస్యమయింది.... ఆడ మూక ఓ పట్టాన తయారయి చావదు కదండీ...." అన్నాడు.

ఆ మసకవెన్నెల్లో ముందు నడుస్తున్న నారయ్యా కుడిచెయ్యి చాగా పొడుగ్గా వున్నట్టు కనపడింది గోపాలరావుకి... నారయ్యకి ఎడం చెయ్యి లేదు. ఇంచుమించు దండవరకు ఆపరేషన్ చేసి తీసేశారు. సన్నగా వేళ్ళాడే చొక్కా అంచులు కనిపిస్తాయి చూసే వాళ్ళకి.

జట్కా తోలుతుండగా బండి తిరగబడి చెయ్యి నజ్జయి పోయిందని కొందరంటారు. నారయ్యలాగే.... కాని యింకా కొందరు ఏదో అయివింటి ఆడాళ్ళ గొడవలో చిత్తుగా తన్నారని, ఆ తన్నడంలో చెయ్యి పచ్చడయిందని అంటారు. ఈ రెండు రకాల వార్తలు గోపాలరావూ విన్నాడు వాటితో పాటు....

'పరాయి చోట తిరిగిన ఆ తల్లీ బాగానే వుంది.... దాని మొగుడు.... మరోడు అందరూ బాగానే వున్నారు. వాళ్ళ కాపరాలు బాగానే వున్నాయి. మధ్యలో చెయ్యి పోగొట్టుకొన్న వాడు నారయ్యే య్యాడు. అంతే లోకం తీరు' అని కొందరన్న మాటా విన్నాడు.

ఎంతేనా చెయ్యి పోయాక నారయ్య జట్కా తోలడం తగ్గి పోయింది. ఒంటి చేత్తో బరువులెత్తి బండిలో పెట్టలేడు.

"ఏంటండీ.... ఉలుకూ-పలుకూ లేకుండా ఏంటో ఆలోచనలో వున్నారు" అన్నాడు నారయ్య.

"అబ్బే ఏం లేదు...." అన్నాడు. అంతగా కాకపోయినా ఆత్రుతగానే వుంది గోపాలరావుకి.

ఇద్దరూ కలిసి తూము దాటుతుంటే నల్లటి వాసన ముక్కు బద్దలు చేసింది. తూము దాటాక యిద్దరూ పాకలున్న పల్లం వేపు నడిచారు.

"ఇక్కడన్నీ పాకలే తప్ప, ఒక్క పెంకుటిల్లైనా లేదే...." అన్నాడు గోపాలరావు - ఏదో వొకటి మాట్లాడాలన్న ధోరణిలో.

'ఫాక్టరీ కూలోళ్ళు, రిక్షా వాళ్ళు, బస్తాలు మోపే వాళ్ళు - అందరూ ఈ బాసతే.... పెంకుటిళ్ళేక్కణ్ణించి వస్తారు బాబుగారూ!" అన్నాడు నారయ్య.

అయిదారు పాకలు....ఓ రెండు మలుపులు, వాడకం నీళ్ళ వోక నిలవుండి తయారయిన ఓ పిల్లకాలవ దాటాక నారయ్య పాకొ చ్చింది. చూరు నీడలో తలుపుకి వేసున్న తెల్లటి తాళం మెరుస్తోంది. నెమ్మదిగా తాళం తీశాడు నారయ్య. లోపలికెళ్ళి లాంతరు గుమ్మం దాకా తీసుకొచ్చి, "లోపలికి రండి....' అన్నాడు.

లాంతరు వెలుగు పాకంతటికీ నిండుగా సరిపోటం లేదు. గుమ్మానికి దగ్గరగా పక్కేసున్న నులక మంచం, పక్కనే చాపా.... చాపకి పైగా గుడ్డ ఉయ్యాలా....ఓ మూల కుండ....కుండకి వెనగ్గా పైన దణ్ణెం - యిలా కొన్ని కనపడ్డాయి గోపాలరావుకి.

"కూచోండి....దాన్నిప్పుడే పిలుచుకొస్తా...." అన్నాడు నారయ్య మంచం చూపిస్తూ.

గోపాలరావు కూచున్నాక లాంతరు ముక్కాలిపీటమీద పెట్టి నారయ్య బైటికెళ్ళాడు.

ఇదివర కెప్పుడూ యిలాటి హరికెన్ లాంతర్ల అనుభవంలేదు గోపాలరావుకి. ఎప్పుడు నారయ్య ఎవర్ని పిలుచుకొచ్చినా గోపాలరావు రూముకే తీసుకొచ్చేవాడు. లేకపోతే మరే లాడ్జి రూమో....అక్కడ ఎలక్ట్రిక్ దీపాలే తప్ప ఈ గొడవ వుండేది కాదు. మనిషి ఫలానా అని చెపుతూ నారయ్య తన పాక విషయం కూడా చెప్పాడు. అందు కనే పెద్ద యిబ్బందిగా లేదు గోపాలరావుకి. మరో సిగరెట్టు వెలిగించి పాకతలుపు చప్పుడుకోసం ఎదురు చూస్తూ కూచున్నాడు.

మరో సిగరెట్టున్నర టైము తర్వాత పాకతలుపు తోసిన చప్పుడు వినిపించింది గోపాలరావుకి. నారయ్య లోపలి కొచ్చాడు. వెనకాల మనిషి గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"బాబుగారు....మీరు దాన్ని సెకండ్ షో సినిమా అయే

టైముకి ఓ అరగంట ముందే వొదిలెయ్యాలి. లేకపోతే చుట్టుపక్కల దానికి లేనిపోని గొడవొస్తుంది. అదీకాక మా ఆడాళ్ళు కూడా వస్తారు...."

నారయ్య అన్న వాటికి...."సరే" అన్నట్టు తలూపాడు గోపాలరావు.

"ఆ టైముకి నేనొచ్చి తలుపుతడతా....విసుక్కోకకండే...." అని నవ్వి వెళ్ళిపోయాడు నారయ్య.

నిండుగా కొంగు కప్పుకున్న తను లోపలికొచ్చి పాకతలుపు గొళ్ళెం వేసింది.

• • •

గంట గడిచేటప్పటికి ముందున్నంత ఎక్సయిటింగ్‌గా అని పించలేదు గోపాలరావుకి....అంతా యిదివరటికలాగే మామూలే అన్న భావన రావటం మొదలైంది. అలా అనిపించటం అంతగా నచ్చ లేదు. అందుకని ఏవేనా కబుర్లలో దిగాలనుకున్నాడు.

అంతవరకూ రవణతో పెద్దగా ఏం మాట్లాడలేదు గోపాలరావు. తను తలుపు వేసొచ్చిన కాస్సేపటికి....

"పేరేమి" టన్నాడు....

"పేరెందుకు లెండి...." అంది నవ్వుతూ.

"ఫరవాలేదు, చెప్పు...." అని మరోసారి అడిగాక.

"రవణ...." అంది.

ఆ తర్వాత గడిచిన గంటలో అంత మాత్రం మాటలూ జరగ జరగలేదు. 'అటు జరుగు....ఇటు జరుగు....' అనుకోటం తప్ప.

ఇప్పుడు మాట్లాడాలనిపించినా, ఏం మాట్లాడటానికి తోచలేదు గోపాలరావుకి. చివరికి—

"సినిమాలు బాగా చూస్తావా...." అన్నాడు.

"ఊఁ" అంది రవణ....అని తనే చాలా సేపు వాటి గురించి మాట్లాడింది....సినిమా హీరోల గురించి, కారులో సరసాల గురించి,

సినిమా కథల్లో పేదవాళ్ళకి గబుక్కున అదృష్టాలు రావడం గురించి....
ఇలా—

మళ్ళీ ఉత్సాహం తెచ్చుకోవాలనే ప్రయత్నంలో గోపాలరావు రవణ మాటల్ని వినీ విన్నట్టు వింటున్నాడు.

అలా వింటూనే...."ఇదివరకు వాళ్ళకన్నా చాలా హుషారుగా ఉంది" అనుకున్నాడు రవణ గురించి. ఆ మసక వెలుగులో ఓసారి పరీక్షగా చూశాడు. పాతికేళ్ళైనా వుండవనుకున్నాడు. రంగేమిటో సరిగ్గా తెలియక పోయినా, నలుపు కాదనుకున్నాడు.

రెండో గంట, మొదటి గంటలా కాకుండా నెమ్మదిగా గంట న్నరలా గడిచింది.

ఇంకో అరగంట గడిచాక నెమ్మదిగా తయారయ్యాడు గోపాలరావు, నారయ్య కోసం ఎదురు చూస్తూ.

"అవును....మీ ఆయన పనిచేస్తుండగా....నువ్వెందుకు ఇలా చెయ్యటం...." అన్నాడు.

రవణ దగ్గరగానే వుంది. నెమ్మదిగా గొణుగుతున్నట్లు చెప్పింది సమాధానం.

"ఆడబిడ్డ, మరిది, అత్తా....అందరం కలిసి యింటికి ఏడు గురం. వాడి సంపాదన గట్టిగా తిండికే చాలదు...." అంది....అవి కాస్సేపాగి—

"అదీగాక....ఆడు పొద్దున్నించీ గొడ్డులా పనిచేసి, అర్ధరాత్రి ఎప్పుడో బాగా తాగొస్తాడు. ఈ ధ్యాసే వుండదు....ఉన్నా ఓ సరదా, సరసం వుండదు...." ఏడుపులాటి నవ్వు నవ్వేస్తూ అంది రవణ.

తలూపటం తప్ప ఏం సమాధానం చెప్పలేడు గోపాలరావు. రవణ చెప్పిన సినిమా కబుర్లు విన్నట్టే అదీ విన్నాడు. నారయ్య వచ్చేక బయటి కొచ్చేసి ఒక్కడూ తన ఇంటివేపు నడుస్తుంటే.... రవణ చెప్పిన మాటలు అక్కడోటి, అక్కడోటి గుర్తొచ్చాయి కేవలం కబుర్లలా.

చదువుకున్న వాడిగా, కొన్ని వందల మంది పని చేస్తున్న జూట్ మిల్ మేనేజరుగా....ఎప్పుడేనా జరిగే వర్కర్ల స్ట్రయికులకు ఫాక్టరీ వాళ్ళతో రాజీ కుదిర్చే పెద్దమనిషిగా....ఆ వూళ్ళో చలామణీ అవుతున్న గోపాలరావులో రవణ మాటలు ఏ మాత్రం కదలిక కదిలించలేదు.

పదేళ్ళ క్రితం మిల్లులో రోజూ జరిగే పని కన్నా ఈ నాడు రోజూ జరిగే పని పది రెట్లెక్కువ. కాని వర్కర్ల సంఖ్యలో మూడొంతుల పెంపు కూడా లేదు. ఈ విషయం గోపాలరావుకీ తెలుసు....తెలిసి కూడా రవణ మాటలు....అతనిలో ఏ మాత్రం కదలిక కలిగించలేదు. తన మిల్లులో పనిచేసే కూలీ రోజూ మోస్తున్న శ్రమ ఎంత? వాడి బతుకు గడుస్తున్న తీరేమిటి అన్నవి ఆలోచించాల్సిన బాధ్యతలేని మనిషి విన్నట్టు విన్నాడు, రవణ మాటల్ని....

(జ్యోతిలో ముద్రితము)